# త్యాగమనే కావ్యంలో....

"అరుంధతి చచ్చిపోయిందట."

ఉదయాన్నే కాఫీ అందిస్తూ బాంబులాంటి మాట చెప్పింది మా ఆవిడ.

ఉలిక్కిపడ్డాను!

"అరుంధతి చచ్చిపోయిందంటే మీరు ఉలిక్కిపడతారని తెలుసు! నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది. మా ఆవిడ ఉమ మహాఘాటని నాకు తెలుసు.

"అది కాదోయ్.... కాఫీ కప్పు కాలితేనూ...."

"కాఫీయేనా? గుండెల్లో కన్నీళ్ళు కూడా కాల్తున్నాయా?

ఉమ మాట సూటిగా తగిల్తే మౌనంగా వుండిపోయాను. కళ్ళల్లో అరుంధతి రూపం కదలాడుతోంది. కాఫీ తాగాలన్పించలేదు. కాని ఉమకు కోపం వస్తుందని చప్పరించాను. అయిదు నిమిషాల తర్వాత ఉమ నా భుజాల చుట్టూ చేతులేసి కళ్ళలోకి చూసింది.

ఉమ కళ్ళలో పేరుకొన్న నీటిపొరల్లో నా ప్రతిబింబం కనిపిస్తోంది.

"చూసారా... నేస్తంగా అరుంధతి చచ్చిపోయిందంటే నాకు కన్నీళ్లు వస్తున్నాయి. నేను మనిషిని! మీ ప్రేయసి పోతే మీకు ఏడుపు రావటంలేదు... మీరు మహర్షి" అంది. నా వ్యక్తిత్వమేమిటో ఉమకు బాగా తెలుసు.

"నేను మహర్షిని... రాజర్షిని కాదు" అన్నాను. హృదయం నిండా అరుంధతి అనుభూతులు నిండుతుంటె ఉమ నన్ను ఒంటరిగా విడిచిపెడితే బావుండుననిపించింది.

'గుండె గదుల్లో కన్నీళ్ల మరిగిపోయి....

వేదన దుర్భరమై వెక్కిళ్లమధ్య

ఏడ్చినవాడు మనిషి....

కంఠంలో కప్పిపుచ్చుకున్నవాడు మహర్షి!!' అని మీ డైరీ మొదటిపేజీలో రాసింది అరుంధతే కదా అందుకని..."

నేను మాట్లాడలేదు.

ఉమతో నాకు పెళ్ళయి మూడు సంవత్సరాలు దాటుతోంది. నా పెళ్ళికి ముందు నేను ప్రేమించిన యువతి అరుంధతి. మా ప్రేమ విషయం తెల్సిన మూడోవ్యక్తి ఉమ. కొన్ని "అల్లర్లలో" ఇరుక్కొని ఉమను చేసుకున్నాక అరుంధతి నాకు కనిపించలేదు. అత్యున్నతమైన భావాలు కల నా భార్య అరుంధతి ప్రస్తావన తెచ్చి ఏనాడూ 'సాధించలేదు.' చిలిపిగా ఏడ్పించటం తప్ప... అలాంటి భార్య దొరకటమే నా అదృష్టం. కాని ఎందుకో రోజులో రెండుగంటలయినా అరుంధతి జ్ఞాపకాల్లో ఉండిపోతాను.

ఎక్కడుందో... ఎలా వుందో....

ఇంకా పెళ్ళి చేసుకోకుండా టీచర్ జాబ్ చేసుకుంటూ అంగడి బజార్‌లోనే ఉంటుందని... అప్పుడప్పుడూ మా ఆవిడ వెళ్ళి వస్తుంది. కాని... అడ్రస్ అడగటానికి నేనెప్పుడూ సాహసించలేదు. ఉమకూడా అరుంధతి నెప్పుడూ మా యింటికి తీసుకురాలేదు.

"నాకు తెలుసు.... మీరు దీర్ఘాలోచనలో పడతారని..." ఉమ చేతులు తీసేస్తూ అంది. అప్పటికే కనుకొనుకుల్లోంచి రెండు నీటిబిందువులు చెక్కిలిపైకి జారుతున్నాయి.

నేను సుతారంగా ఉమ కన్నీటిని తుడిచాను. ఏమనుకుందో చప్పున

నా నుదుటిని చుంబించి తలను గుండెలకు అదుముకొని చాలా సేపు ఏడుస్తూ ఉండిపోయింది.

కొంచెం సేపటికి "మనసు తేలికపడిందా" అన్నాను. అప్పుడు ఉమ కళ్ల వర్షం వెలిసిన ఆకాశంలా... నిర్మలంగా వున్నాయి. అయినా నా ఆలోచనలన్నీ అరుంధతి చుట్టూ తిరుగుతున్నాయి.

చివరిసారిగా అరుంధతిని చూస్తే బావుండుననిపిస్తోంది. కానిఅడ్రస్ తెలీదు. నాకై నేను ఎప్పుడూ ఉమ దగ్గర ఆమె ప్రస్తావన తీసుకు రాలేదు.

"మీకు అరుంధతి శవాన్నైనా చూడాలన్పించటం లేదా?" ఉమ అడిగింది. ఆ ఒక్క మాటకు నా కళ్ల తడితడిగా మారాయి. ఏం సమాధానం చెప్పను? చెప్పడానికి నా గొంతు ఎప్పుడో పూడుకుపోయింది.

"అరుంధతి అంటే మీకు ప్రాణం కదూ....

ఉమ మాటలో వింతధ్వని గోచరించింది మొదటిసారి. ఆ వింత ధ్వనుల్లోనే 'సాధింపులు' మొదలవుతాయి. ఉమస్థానంలో మరే ఆడదీ వున్నా నేను చిత్రహింసలు అనుభవించేవాణ్ణి సాధింపులతో.

"చెప్పండి."

"పెళ్ళికి ముందు..." నేను మాట్లాడానో లేదో నాకే తెలీదు.

"మీ గుండె నాలుగ్గదుల్లో ఎన్నింట్లో ఆమె స్థానమేర్పరుచుకుంది?"

ఉమ కళ్లలోకి విచిత్రంగా చూసాను. ఆ కళ్ల ప్రశ్నించటం ఆగిపోయాయి. కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండిపోయి "నేను ఆఫీసు కెళ్ళాలి" అన్నాను ముక్తసరిగా.

"ఈ రోజు ఆదివారంగా."

"ఈ రోజు ఆదివారం" అంటూ చేతిలో చెయ్యేసి నవ్వింది.... మెల్లగా!

దొరికిపోయాను !!

"సీరియస్‌గా తీసుకోకండి. మీ మూడ్ బావుండదు నాకు తెల్సు మిమ్మల్ని నాలుగైదు గంటలపాటు ఒంటరిగా విడిచిపెట్టడం మంచిది.

అందుకే నేను మార్నింగ్‌షో సినిమాకెళ్తున్నాను. భోజనంచేసి పడుకోండి" అంటూ బెడ్‌రూంలోకి దూరింది.

నా మూడ్‌ని బట్టి ఉమ ప్రవర్తన ఉంటుంది. అదే నాకు అమితంగా నచ్చుతుంది. అప్సరసలా తయారై తలలో మల్లెపూలతో వచ్చి ఉమ నన్ను కౌగలించుకునే వరకూ నేను అరుంధతి ఆలోచనల్లోనే వున్నాను. ఉమ "శోభనం నాటి పెళ్లికూతురు"లా వుంది.

"సిన్మాకెళుతున్నాను.... అరుంధతి గురించి ఎక్కువ ఆలోచించి మనసు పాడు చేసుకోకండి" అని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. మరో సమయంలో అయితే ఆ ముద్దుకి ఉమ మంచంలో వుండేది.

ఉమ వెళ్ళాక.... పాత సూట్‌కేసులోని డైరీల్ని తీసాను. అరుంధతి తాలూకు గత స్మృతులు డైరీ పేజీల్లో దొర్లిపోతూంటే రెండు గంటలు నిశ్శబ్దంగా ఏడ్చాను. ఉమను యాంత్రికంగా పెళ్ళిచేసుకున్నా. కాని ఉమ ప్రవర్తన సామాన్య స్త్రీలా వుంటే నేను మరింత నిర్లిప్తతకు లోనయ్యేవాణ్ణి. కాని ఉమ సాధ్యమైనంత వరకూ అరుంధతి జ్ఞాపకాల్లోంచి బయటపడేలా చేసేది. అయినా మనసులో నిరంతరం ఏదో అశాంతి తొలుస్తూనే వుండేది.

ఈ మూడేళ్ళలో మాకు పిల్లలు పుట్టలేదంటే....కొన్ని రాత్రులు వర్తమానం మరచి ఆమె జ్ఞాపకాల్లోనే వుండేవాణ్ణి ప్రక్కలో ఉమ వెక్కిళ్ళు విన్పించేంతవరకూ నా చెయ్యి ఉమ మీద పడేదికాదు.

ఇంతటి బడబాగ్నిని కన్నవాళ్ళకు కూడా చెప్పుకునేది కాదు. అప్పుడు నన్ను నేను నిందించుకునేవాణ్ణి.... నా మీద నాకే చాలా అసహ్యం వేసేది. అది కొద్దిసేపే!!

అరుంధతిని చూడక నాలుగేళ్లు దాటుతోంది. డైరీల్ని సర్దేసి వస్తున్న నాకు డ్రెసింగ్ టేబిల్‌మీద మడిచిన కాగితం కన్పిస్తే చూసాను... అది అరుంధతి అడ్రసు!

'అరుంధతి'

నైటింగేల్ నివాస్, అగండి బజార్, జగిత్యాల్.

నాకెందుకో ఆ క్షణంలో అరుంధతిని చూడాలనిపించింది. ఇన్నాళ్ళూ ఆ ఎడ్రస్ దొరక్కుండా ఉమ జాగ్రత్త పడింది. ఎంతైనా మగాడు....ఏం జరుగుతుందోనని! సిన్మా తొందరలో అది అక్కడ మర్చిపోయివుంటుంది.

ఉమ వచ్చేలోగా అరుంధతి శవాన్నయినా చూడాలి...

కన్నీటి వీడ్కోలుతో కడసారి... డ్రెస్ వేసుకొని కదిలాను.

*　　　*　　　*

'నైటింగేల్ నివాస్'

గేటు ప్రక్కన అందంగా మెరుస్తున్న గోల్డ్ కవర్ అక్షరాలు. గేటు తెరుచుకొని లోపలికి అడుగుపెట్టాను. పూలమొక్కలు అందంగా వూగుతున్నాయి. నా గుండె వేగం పెరిగింది. ఏ అలికిడీ లేదు.

అరుంధతి శవం తరలిపోయిందా... ఆ జాడలేవీలేవు.

గేటు తిరిగి దగ్గర వేస్తుంటే కీస్‌మన్న శబ్దానికి 'ఎవరూ' అంటూ తొంగి చూసింది.

ఆమె...

అరుంధతి...

ఆమె చచ్చిపోలేదా?

నన్ను చూసి నమ్మలేనట్లుగా తలుపు దగ్గర శిలావిగ్రహమై నిల్చుందామె.... చాలా మారిపోయింది. ఇప్పుడు మేరుపర్వతంలా నిండుగా వుంది. చేతిలో చలం 'మైదానం' వుంది.

అయిదు నిమిషాలు గడిచాయి...

కన్నీటిపొరల్లో ఇద్దరం అస్పష్టంగా చూసుకుంటూ నిల్చున్నాం. తనే తేరుకొని 'రండి' అని ఆహ్వానించింది.

ఆ ఇంట్లోకి అడుగు పెడుతున్నపుడు ఉమ గుండెలమీద నా కర్కశ పాదాల్ని వేస్తున్న అనుభూతితో మనస్సు గిలగిలలాడింది. ఇల్లు అందంగా అలంకరించబడివుంది. అప్పుడే అరుంధతి బెడ్‌రూంలోంచి బరువైన

మూలుగు విన్పించటంతో "ఒక్క నిమిషమండి...." అని ఆమె అటువైపు కదిలింది. నేనూ అనుసరించాను పరిసరాల్ని పరికిస్తూ...

ఆ గదిలోకి చేరగానే...గుండె అగ్నిపర్వతంలా ప్రేలి లావాలా చిమ్ముకొచ్చిన కన్నీళ్ళు వేడిగా జారిపడ్డాయి.

అరుంధతి బెడ్ మీద ఉమ!!

"ఉమా... ఏమయిందే?" అరుంధతి తట్టిలేపింది.

ఉమలో చలనం లేదు. ఏ కదలికా లేదు. వెల్లకిల్లా పడుకొన్న ఉమ పిడికిలిలోంచి ముద్దలా ఓ కాగితం జారిపడింది. నేనే అందుకున్నాను.

"ఉమా... మాట్లాడవే.... ఏమయిందే" అరుంధతి పిలుస్తూనే వుంది. చేతి నరాలు ప్రకంపిస్తుంటే నేను కాగితం విప్పాను.

"ఏమండీ...."

వచ్చారా? మీరు ఇక్కడికి వస్తారని నాకు తెలుసు. మీ మనసుని చదివిన భార్యని. మీ అంతరంగం అరుంధతి కోసం ఎంత ఆక్రోశిస్తుందో నాకు తెలీదా.... నా ప్రక్కనే ఎన్ని రాత్రులు కలవరించారు. అందుకే అరుంధతి చచ్చిపోలేదు.

ఈ ఉమ చచ్చిపోయింది. మీరు సుఖపడాలనే మీ భార్యగా నేను తీసుకున్న నిర్ణయం ఇది! ఆ ఇంట్లో నా జ్ఞాపకాలు వెంటాడొచ్చు. మీరిద్దరు ఈ ఇంట్లోనే వుండండి.

శ్రీ...నాకోసం ఒక్క కన్నీటి చుక్క రాల్చు. నీ ఋషిత్వాన్ని ఆపాదించుకొని వచ్చిన ఆ చుక్కలో తడిసి నా ఆత్మ మరింత పావనం కావాలి.

శ్రీ నేను సెలవు తీసుకుంటాను. అరుంధతీ నన్ను క్షమిస్తావు కదూ...!

మీ ఉమ"

అప్పటికే అరుంధతి ఉమ పాదాలపైబడి గుండెలవిసేలా రోద స్తోంది. నేను స్థాణువులా నిలబడే ఉన్నాను. అలాగే.... అలాగే... ★